క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి, బృందావన్ కాలనీ ఫీడర్‌లలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు టాటానగర్, బృందావన్ కాలనీ, ప్రగతి కాలనీ, మొగల్స్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, రామకృష్ణాహిల్స్, వినాయక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. బండ్లగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అలీనగర్, ఆయిషా కాలనీ, అహ్మద్‌నగర్, ప్లేస్ వ్యూ కాలనీ, కింగ్స్ ఎవెన్యూ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

సులేమాన్‌నగర్ ఫీడర్ పరిధిలో...

రాజేంద్రనగర్: సులేమాన్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. సులేమాన్‌నగర్, ఖాజా హోటల్, డైమండ్ సిటీ ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. చింతల్‌మెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని వాదే సులేమాన్‌నగర్, అక్బర్ హిల్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని వారు వివరించారు.

పేదలకు అల్పాహారం పంపిణీ



రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని హెల్ప్ ఆన్ వీల్స్ ట్రస్టు టీమ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు శుక్రవారం అల్పాహారాన్ని పంపిణీ చేశారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్, అత్తాపూర్ బసవ తారకమ్ ఆస్పత్రి, మెహిదీపట్నం ప్రాంతాల్లోని పేదలకు ఈ అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకుడు బండ్లగూడెం కవితా ప్రసాద్ మాట్లాడుతూ... ఆరు సంవత్సరాలుగా ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 200 మందికి అల్పాహారాన్ని అందజేసినట్లు వెల్లడించారు. సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆకలిని తీర్చేందుకు తమ వంతు సహాయ సహకారాలను ప్రతి నెలా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. నిర్వాహకులు అప్పారెడ్డిగూడెం మహేందర్, కోరని కుమార్, రాజగోపాల్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి



మంజూరు పత్రాలు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: ఆపద సమయంలో సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 60 వేల మంజూరు పత్రాలను బాధితులకు వి.జగదీశ్వర్‌గౌడ్ శుక్రవారం అందజేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని శంషీగూడకు చెందిన మంజుల వైద్య ఖర్చుల కోసం జగదీశ్వర్‌గౌడ్ కలిసి పరిస్థితిని వివరించి, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం కోరగా, వెంటనే దానికి అవసమైన ప్రక్రియ పూర్తి చేసి మంజూరు పత్రాలను మంజులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పట్వారీ శశిధర్, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ పర్యటన

గోల్కొండ: కార్వాన్, టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలో ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ డివిజన్ బస్తీల్లో రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్వాన్ నుంచి పురానాపూల్ వరకు దర్బార్ మైసమ్మ ఆలయం నుంచి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయని సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం టోలిచౌకీ డివిజన్‌లోని నదీమ్ కాలనీలో పర్యటించారు. ఆయన వెంట టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, అలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

కోట కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి నెలకొన్నది. శుక్రవారం పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో టికెట్ కౌంటర్ నుంచి కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయం, నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టికో ప్రాంగణం తదితర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. మరోవైపు యువత కోటనగీనాబాగ్‌లో ఉన్న ఫిరంగుల వద్ద సెల్ఫీలు దిగారు.

స్ఫూర్తిప్రదాత మన్మోహన్‌సింగ్

- మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటు
- ఆయన సేవలు చిరస్మరణీయం
- ఆర్థిక సంస్కరణలతో దేశ పురోగతికి శ్రీకారం
- వాడవాడలా మన్మోహన్‌కు నివాళి

రాజేంద్రనగర్: మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి ప్రధానంగా దేశ ఆర్థిక పురోగతికి తీరనిలోటు అని పలువురు కాంగ్రెస్ నాయకులు విచారం వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ మరణానికి సంతాప సూచకంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్మోహన్ దేశ ఆర్థిక శాఖ మంత్రిగా.. ప్రధాని మంత్రిగా దేశంలో శ్రీకారం చుట్టిన ఆర్థిక సంస్కరణలు తద్వారా దేశం సాధించిన పురోగతిని గుర్తుచేసుకున్నారు. ఆయన నిష్కళంగా రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శమని.. ఆయన ఆశయాల సాధనకు యువత నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు.

◆ రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, మాజీ అధ్యక్షుడు పంబళ్ల రాజు, వైస్ ప్రెసిడెంట్ వీర్లపల్లి నవీన్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు గొడుగు సంజీవ, ఉపాధ్యక్షులు ఎస్.పెంటయ్య, పత్యారా, నరసింహా, సావాద రవి, ఉపేందర్, కార్తీక్, నాని, సీపీఐ నేత నరసింహా తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



ఆరాంఘర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు

పేదల సంక్షేమానికి అవిరళ కృషి

మైలార్‌దేవ్‌పల్లి: పేద ప్రజల సంక్షేమం.. అభ్యున్నతి కోసం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఎనలేని కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనంజయ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేఆర్ ఆరాంఘర్ చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలంటూ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బి-బ్లాక్ అధ్యక్షుడు మహమ్మద్ ఖాలిక్, సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఇస్మాయిల్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బొల్లా వెంకటేష్, రవీందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, ఉపేందర్, శ్రీనివాస్, గోపి, రాము, గోల్కొండ యాదయ్య, నర్సింహ్మయాదవ్, ఓంప్రకాష్, శ్రీనివాస్, విఘ్నేష్, గోపికృష్ణ, హరీందర్‌సింగ్, సహదేవ్, నహీం, రాంబాబు, బస శ్రీను, గట్టయ్య, మధుబాబు, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం

అత్తాపూర్: ఆర్థిక సంస్కర్త, రాజనీతిజ్ఞుడు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ లేని లోటు పూడ్చలేనిదని రాజేంద్రనగర్ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘం ఉపాధ్యక్షులు భానోదయ భాస్కర్ అన్నారు. క్లిష్ట సమయంలో ప్రధానిగా ఎన్నికైన మన్మోహన్‌సింగ్ రెండుసార్లు భారత దేశ పలు ఆర్థిక సంస్కరణ తీసుకొచ్చి విషయాన్ని ముందు వరుసలో తీసుకొచ్చిన ఘనత దక్కుతుందని కొనియాడారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో అత్తాపూర్ రాంబాగ్ ప్రాంతంలో ఉన్న భానోదయ పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులతో కలిసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.



రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నేతలు



మణికొండలో కాంగ్రెస్ నాయకులు

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు..

మణికొండ: దేశ ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా పనిచేసిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ దేశంలో ఎన్నో సంస్కరణలకు నాంది పలికారని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో మన్మోహన్ చిత్రపటానికి నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్‌లతో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో దేశం ఎన్నో ఆర్థిక సంస్కరణలతో అభివృద్ధిలో దూసుకుపోయిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు ఉషారాణి, దుర్గేష్‌యాదవ్, నాయకులు పాపిరెడ్డి, వినోద్‌కుమార్, హరికృష్ణ, కె.శేఖర్, ప్రభు, నరేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో నివాళులర్పిస్తున్న జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు

మణికొండలో...

మణికొండ: మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటు అని కాంగ్రెస్ నాయకులు విచారం వ్యక్తం చేశారు. మణికొండలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్ కుమార్, కౌన్సిలర్‌లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, తాజుద్దీన్, నాయకులు యాలాల నరేష్, బి.శ్రీరాములు, ముత్యాలు, లక్ష్మీశ్రీ, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



డాక్టర్ ఏవీఎస్ రెడ్డికి నివాళులర్పిస్తున్న ఏవీఎస్‌నగర్‌వాసులు

రాజేంద్రనగర్: ఎన్‌ఐఆర్‌డీ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.వి.ఎస్.రెడ్డి వర్ధంతిని శుక్రవారం రాజేంద్రనగర్‌లోని మానసా హిల్స్‌లోని ఏవీఎస్ రెడ్డినగర్‌లో ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఏవీఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... రూరల్ టెక్నాలజీ పార్కు నిర్మాణం సందర్భంగా స్థానికంగా పని చేస్తున్న నిరుపేదల కోసం డాక్టర్ ఏవీఎస్ రెడ్డి 23 ఇళ్లను నిర్మించి అందించారన్నారు. సంస్థలో పని చేసే ప్రతి ఉద్యోగి బాగోగులను పట్టించుకున్న గొప్ప అధికారి అని కొనియాడారు. గుట్టలను చదును చేస్తూ పని చేస్తున్న కుటుంబాలను గుర్తించడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆలోచించే మనసున్న మహారాజు ఏవీఎస్ రెడ్డి అని గుర్తు చేశారు. ఏవీఎస్ రెడ్డి తనయుడు విజయకృష్ణ తమ కాలనీలో నివాసముంటున్న వారికి మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చారని గుర్తు చేశారు. ఆ కుటుంబానికి ఏవీఎస్ రెడ్డి కాలనీలో నివాసముంటున్న ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. కాలనీ నేతలు చెన్నమ్మ, మల్లేష్, సాయిలు, హనుమంతు, ఎల్లయ్య, దేవమ్మ, బండారి, శివరాం పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత



విజేత జట్టుకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న దృశ్యం

శంషాబాద్: తొండుపల్లి ఎంపీఎస్ క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా జరిగిన తెలంగాణ ప్రీమియర్ అండర్–16 క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఏకే–47 జట్టు టోర్నీ విజేతగా నిలిచింది. ఆ జట్టుకు కౌన్సిలర్ పారెపల్లి లావణ్యగౌడ్ తరఫున ఆమె భర్త పారెపల్లి శ్రీనివాస్‌గౌడ్ రూ. 50 వేలను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు మంచి భవిష్యతుకు పునాది వేస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందన్నారు. నిర్వాహకులు, స్థానిక నేతలు కొండ పరమేష్‌గౌడ్, దొడ్డ పెంటయ్య, కొండ దర్శన్, రాజు, రమేష్, శివశంకర్‌గౌడ్, సాయి శివ శంకర్, చిట్టి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధుబన్ కాలనీలో 'కార్డన్ సెర్చ్'

- అనుమానాస్పద ప్రాంతాల్లో మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల తనిఖీలు
- నిషేధిత గుట్కా ప్యాకెట్ల స్వాధీనం
- ధ్రువపత్రాలు లేని వాహనాల సీజ్
- గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు: ఇన్‌స్పెక్టర్ నరేందర్



మధుబన్ కాలనీలో కార్డన్ సర్చ్‌లో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు



నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



దుకాణాల్లో తనిఖీ చేస్తూ...

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ ఆధ్వర్యంలో మధుబన్ కాలనీలోని పలు ప్రాంతాల్లోని దుకాణాల్లో నిల్వ చేసిన నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు, ధ్రువపత్రాలు లేని వాటిని సీజ్ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ మాట్లాడుతూ... మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది వలస కార్మికులు వచ్చి నివాసం ఉంటున్నారన్నారు. చాలా దుకాణాల్లో నిషేధిత గుట్కాలను విక్రయిస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. వీటిని ఉపేక్షించమన్నారు. కొన్ని ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందుతుందన్నారు. గంజాయి విక్రయించిన, సేవించిన చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తుకు బానిసై తమ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఇలాంటి వారిని గుర్తిస్తున్నారన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలను చేపడుతున్నామన్నారు. కార్డన్ సెర్చ్‌లో ఎస్‌ఐ హైడినాయుడు, ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై పడేయకుండా ఇళ్లవద్దకు వచ్చే కార్మికులకు అందజేయాలన్నారు. శుక్రవారం 16వ డివిజన్‌లోని భవాని నగర్ కాలనీ, 17వ డివిజన్‌లోని భాగ్యనగర కాలనీ, 18వ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీలలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ ఇంట్లోని చెత్తాచెదారాలను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దన్నారు. శానిటరీ జవాన్లు వెంకటేష్, జగన్, సురేష్, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపల్ సమావేశం వాయిదా

మణికొండ: మణికొండ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశామని మేనేజర్ శ్రీధర్ తెలిపారు. మున్సిపల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించాల్సి ఉంది. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం నేపథ్యంలో శుక్రవారం ప్రభుత్వం సెలవు ప్రకటించిన విషయం విదితమే. వాయిదా పడిన మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని తిరిగి నిర్వహించే తేదీని నిర్ణయించలేదని మేనేజర్ పేర్కొన్నారు. కౌన్సిలర్‌లు డిమాండ్ చేస్తున్న పనులన్నింటినీ ఇంజినీరింగ్ శాఖ ఎస్టిమేట్‌లు చేస్తున్నందున అవి పూర్తి కాగానే ఓ తేదీ నిర్ణయించి సమావేశం నిర్వహిస్తామన్నారు. త్వరగా ఎస్టిమేషన్‌లను పూర్తి చేయాలని వారికి సూచించామన్నారు.

అత్తాపూర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం



అత్తాపూర్‌లో ధ్వంసమైన కచ్చామోరీ

అత్తాపూర్: అత్తాపూర్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. గ్రామ పంచాయతీ కాలం నాటి కచ్చా మోరీలను ఆధునికీకరించకుండానే సీసీ రోడ్లను నిర్మించారు. దీంతో స్థానికంగా డ్రైనేజీలు అధ్వానంగా తయారై మురుగు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని అత్తాపూర్ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్తాపూర్ భరత్‌నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలోని ఓ పెద్ద రంధ్రం ఏర్పడింది. దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

అత్తాపూర్ బ్రాండ్‌ను ఉపయోగించుకుంటూ వ్యాపారాలు చేసుకుంటున్న బహుళ అంతస్తుల నిర్మాణదారులు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాల్సి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టకుండా యుద్ధ ప్రతిపాదికన శాశ్వత ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజేంద్రనగర్‌లో 'స్వచ్ఛతా పక్వాడా'



ఆలయ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలను చీపుర్లతో శుభ్రం చేసి తొలగించారు. టెక్నికల్ అధికారులు వెంకట్రాం, డాక్టర్ లక్ష్మణ్, ఎం.శేఖర్‌రెడ్డితో పాటు డాక్టర్ వెంకట్ కుమార్, డాక్టర్ పి.వెంకటేశం, పతియారా, నరసింహా, నార్మ్ ఫార్మ్ స్టాఫ్ పాల్గొన్నారు.



స్వచ్ఛత పక్వాడాలో పాల్గొన్న నార్మ్ అధికారులు

ఇష్టారాజ్యంగా వ్యర్థాల పారబోత



అత్తాపూర్ మూసీ ప్రాంతంలో డంప్ చేసిన వ్యర్థాలు

అత్తాపూర్: గృహ నిర్మాణాల వ్యర్థాలు నిరుపయోగంగా ఉన్న వస్తువులు, చెత్తాచెదారాలను మూసీ నది పరీవాహక ప్రాంతంలో కుప్పలు తెప్పలుగా వేస్తున్నారు. దీంతో మూసీ నది తీర ప్రాంతమంతా వ్యర్థాలతో నిండిపోతూ అక్రమణలకు గురవుతోంది. అత్తాపూర్ పాత గ్రామ సరిహద్దు నుంచి మూసీ నది ప్రవహిస్తూ ఉంటుంది. అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో నూతనంగా నిర్మించుకునే గృహ నిర్మాణదారులు పురాతన ఇళ్ల వ్యర్థాలను మూసీ నదిలో డంపు చేస్తున్నారు. డంప్ చేసిన ప్రాంతాలను అక్రమణదారులు చదును చేసి ఆయా ప్రాంతాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామ సరిహద్దులను సూచిస్తూ మూసీ నది పరీవాహక ప్రాంతంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పరీవాహక ప్రాంతాలు కబ్జాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ మేరకు సంబంధిత అధికారులు సహరిద్దుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.